# కష్టం వచ్చింది

— తిరుమలశ్రీ



కోటిపల్లి రేవులో పడవమీద గోదావరి దాటుతూవుంటే థ్రిల్లింగ్‌గా వుంది శేఖర్‌కు. సాయంకాలపు శీతల పవనాలు మనసుకు ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి. కాకినాడ నుండి ఎండలో చేసిన బస్ ప్రయాణంతో విసుగెత్తిన శేఖర్‌కు, అప్పుడే ఖైదు నుండి విడుదల చేయబడిన వ్యక్తి స్వేచ్ఛావాయువులను పీల్చుకున్నంత హాయిగా, సంతోషంగా వుంది, గోదావరి గాలి సోకడంతో.

రేవు దాటాక మరో రెండు బస్‌లలో ప్రయాణం చేయవలసి వుంది అతను. గన్నవరం చేరుకునేసరికి బాగా ప్రొద్దుపోతుందనుకున్నాడు. గోదావరి మీద పడవ ప్రయాణం సరదాగా వున్నా, బస్ ప్రయాణాలను తలుచుకునేసరికి, అవస్థపడి అంతదూరం వెళ్ళక




పోతేనేం అనిపించింది.

కాని, 'మారేజెస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్' అన్న లోకోక్తి గుర్తుకొచ్చింది. తనకు ఆ పిల్ల నచ్చినట్లయితే యికపైన తాను తరచు కోటిపల్లి రేవు దాటవలసి వుంటుందనిపించడంతో, సన్నగా నవ్వుకున్నాడు.

శేఖర్ స్వగ్రామం కొవ్వూరు. కాని, వుద్యోగరీత్యా కాకినాడలో వుంటున్నాడు. గన్నవరంలో ఓ మంచి సంబంధం చూసి వచ్చామనీ, రెండెకరాల పొలము, ఐదు వేల క్యాషూ కట్నంగా ఇస్తున్నారనీ, శేఖర్ వెళ్ళి పిల్లను చూసి వచ్చినట్లయితే, నచ్చితే ముహూర్తం పెట్టించుకోవచ్చుననీ, తండ్రి వుత్తరం రాయడంతో బయలుదేరాడు శేఖర్.

అయితే, శేఖర్‌కు కొన్ని ఆద

ర్శాలు వున్నాయి. వాటిలో కట్నం తీసుకోకుండా పెళ్ళి చేసుకోవాలన్న దొకటి. అంతేకాక, వీలయితే గుణవంతురాలయిన పేదపిల్లను చేసుకోవాలనుకునేవాడు.

గన్నవరం వెళ్ళి పిల్లను చూసి మాట్లాడాలనుకున్నాడు. తనకు కావలసింది అమ్మాయి నచ్చడం- ఆపైన కట్నకానుకలు ఇచ్చినట్లయితే ఆ సంబంధం చేసుకోనని, ఆమె తండ్రితో ఖచ్చితంగా చెప్పా

## 2

హొటల్లో భోజనం చేసి వచ్చి టి. బి. కి చేరుకున్నాడు శేఖర్. క్రొత్తచోటయినా, పగ లంతా బాగా అలిసిపోయి వుండడంతో త్వరగానే నిద్రపట్టేసింది.

అయితే—

గాఢనిద్రలో వున్న శేఖర్‌కు ఎవరో కుదిపిలేపినట్లయి, హఠాత్తుగా మెలకువ వచ్చింది.

గదిలో చీకటిగా వుంది.

**వయసు వచ్చిన ఒక ఆడపిల్ల, తనను పెళ్ళి చేసుకొమ్మంటూ ఒక అపరిచితుణ్ణి ప్రాధేయపడే స్థితికి దిగజారిపోయిందా మనదేశ పరిస్థితి! మన సామాజికపు విలువలు అంత హీనస్థితికి జారిపోయాయా? దీనికి హేతువేమిటి? కట్న పిశాచా??**

లని నిశ్చయించుకున్నాడు. కట్నం వొద్దంటే తన తండ్రి రియాక్షన్ ఎలా వుంటుందో తనకు తెలుసు. కాని, తండ్రిని ఏవిధంగా వొప్పించాలో కూడా తెలుసు తనకు!

గన్నవరం చేరుకునేసరికి రాత్రి ఎనిమిది దాటింది. ఆ వేళప్పుడు వెళ్ళి 'వాళ్ళకు' ఇబ్బంది కలిగించడం ఇష్టంలేక, ఆ రాత్రికి ట్రావెలర్స్ బంగళాలో బస చేయడానికి నిర్ణయించుకున్నాడు.

చేతినున్న రేడియండయల్ వాచ్ పన్నెండూ ఇరవయ్ చూపుతోంది.

ఎందుకు మెలకువ వచ్చిందో వూహించలేకపోయాడు శేఖర్.

అంతలో, గదిలో ఏదో అలికిడి వినిపించింది.

మెత్తని అడుగుల చప్పుడు....

సన్నగా గాజుల సవ్వడి....

ఎవరో ఏడుస్తున్నట్లు వెక్కిళ్ళ ధ్వని.... సన్నగా దుఃఖిస్తోన్న యువతి స్వరం....

బెడ్‌కు కొంతదూరంలో చీకట్లో తెల్లని ఆకారం లీలగా గోచరించడంతో-శేఖర్ గుండె ఝల్లుమంది.

చీకటికి అలవాటుపడిన కళ్ళకు స్త్రీరూపం స్పష్టంగా కనిపిస్తోంది.

ఎవరు....?!

ఎవరామె —?

ఎందుకు ఏడుస్తోంది??

గదిలోకి ఎలా వచ్చింది???

పడుకునేముందు లోపల గెడ పెట్టడం తనకు బాగా జ్ఞాపకముంది.

అయితే, ఆమె ఎలా ప్రవేశించింది?!

కొంపదీసి ఆమె....!?

ఉలిక్కిపడ్డాడు శేఖర్. ఆ ఆలోచన కలగడంతో, భయంతో వొళ్ళంతా చెమటలు పట్టేసింది.

గ్రామాలలోని ట్రావెలర్స్ బంగళాలలో అప్పుడప్పుడు దయ్యాలు తిరుగుతూ వుంటాయని ఎప్పుడో ఆలకించిన గుర్తు!

లేచి లైటు వేద్దామంటే భయంతో శరీరం బిగుసుకుపోయింది.

ఎవరో అడుగుదామంటే నోట మ్మాట మాటరావడం లేదు.

అయిదు నిముషాలు అలాగే వుండిపోయాడు శేఖర్, ఆంజనేయ దండకం చదవబోయి, కంగారులో అమ్మవారి దండకం చదివేస్తూ.

ఆమె ఇంకా ఏడుస్తూనేవుంది!

కొద్దిగా ధైర్యం పుంజుకున్నాడు. నెమ్మదిగా బెడ్ మీద లేచి కూర్చున్నాడు. లైట్ స్విచ్ దగ్గరకు వెళ్ళడానికి ధైర్యం చాలడం లేదు.

ఎలాగో గొంతు పెగల్చుకున్నాడు.

"ఎవరు....ఎవరు నువ్వు....?" అన్నాడు.

తన మాట తనకే వినిపించనంతగా, నూతిలోనుండి వచ్చినట్లనిపించింది.

సమాధానం లేదు.

"ఎందు కేడుస్తున్నావ్?"

హఠాత్తుగా ఏడుపు ఆగిపోయింది.

ఆ ఆకారం అతనివైపు చూస్తున్నట్లుంది- "నీకు తెలియదూ?" అంది తీక్షణంగా.

అది స్త్రీ స్వరం!.... నిర్ధారణ చేసుకున్నాడు శేఖర్. స్వరాన్ని బట్టి టీనేజ్ గర్ల్ అయివుండాలని అంచనా వేసుకున్నాడు.

ఆమె జవాబివ్వడంతో కొద్దిగా ధైర్యం పెరిగింది. ఆఫ్టరాల్, దయ్యాలు మనుష్యులతో మాట్లాడినట్లు ఎక్కడా ఆలకించిన జ్ఞాపకం లేదు.... ఆమె మనిషేనన్నమాట!

"నువ్వెవరో నే నెరుగను. ఎందుకు ఏడుస్తున్నావో నాకెలా

తెలుస్తుంది?" అన్నాడు.

"తెలిస్తే మాత్రం ఏం చేయ గలవ్?"

ఆశ్చర్యపోయాడతను.

"అవసరమైతే చేతనయిన సహాయం చేయగలను"

"నిజం?" అందామె. "మిస్టర్! నన్ను పెళ్ళి చేసుకుంటావా?"

"పెళ్ళా!?"

"ఔను. మా నాన్న కట్నం ఇచ్చుకోలేడు. ఉన్నది కాస్తా నా పెళ్ళికే వూడ్చిపెడితే అమ్మా, నాన్నా ఏం తింటారు? ఎక్కడ వుంటారు?" వెక్కి వెక్కి ఏడ్చిందామె. "ప్లీజ్! కట్నం తీసుకోకుండా నన్ను పెళ్ళి చేసుకోవూ?"

భయం స్థానంలో ఆశ్చర్యం చోటు చేసుకుంది శేఖర్‌లో.

ఆమె ఎవరు? లోపలికి ఎలా వచ్చింది? ఎందుకు ఏడుస్తోంది? కట్నం ఇచ్చుకోలేని కారణంగా ఆమె అవివాహితగా వుండి పోయిందా? అయితే, అర్ధరాత్రప్పుడు ట్రావెలర్స్ బంగళాలో ఆమెకు ఏం పని? ముక్కూ, మొగమూ ఎరుగని తనను -ఒక అపరిచితుణ్ణి- పెళ్ళాడమని ప్రాధేయపేడడంలో ఆమె అభిప్రాయమేమిటి?....అన్నీ ప్రశ్నలే!

"ప్లీజ్!.... కట్నం తీసుకోకుండా నన్ను పెళ్ళి చేసుకోవూ?" ప్రాధేయపడుతోందామె....సన్నగా ఏడుస్తోంది....మధ్య మధ్య వెక్కి వెక్కి పడుతోంది.

శేఖర్‌కు మతి పోయినట్లు వుంది....

వయసు వచ్చిన ఒక ఆడపిల్ల, తనను పెళ్ళి చేసుకొమ్మంటూ ఒక అపరిచితుణ్ణి ప్రాధేయపడే స్థితికి దిగజారిపోయిందా మన దేశ పరిస్థితి! మన సామాజికపు విలువలు అంత హీనస్థితికి జారిపోయాయా? దీనికి హేతువేమిటి? కట్నపిశాచా? ఎట్టి పరిస్థితులలో ఒక భారత యువతి, అట్టి స్థితికి దిగజారుతుంది?! ఈ సాంఘిక దురాచారాన్ని రూపుమాపేదెలా? సమూలంగా నిర్మూలించేదెలా??

ఆమె ఎవరో తానెరుగడు. పూర్వాపరాలు తెలుసుకోకుండా మాట ఇవ్వడం శేఖర్‌కు ఇష్టం లేదు.

మొదట ఆమెను వోదార్చాలనుకున్నాడు. ఆమె వివరాలు తెలుసుకుని తాను చేయగలిగిన ఉపకారం చేయాలనుకున్నాడు. అవసరమైతే ఆమెను వివాహమాడడానికి కూడా తాను సిద్ధమే!

బెడ్ మీదినుండి దిగి స్విచ్ వైపు నడిచాడు.

"నీ పేరేమిటి?" అంటూ లైట్ వేసాడు.

శ్వేతవస్త్రాలలో అందంగా మెరిసిపోతోన్న పద్దెనిమిదేళ్ళ పడుచు....

లైటు వెలగడంతో ఉలిక్కిపడిందామె.... మరుక్షణంలో అదృశ్యమయింది!!

"బాబోయ్, దయ్యం....!!" అని అరుస్తూ భయంతో స్పృహ తప్పి పడిపోయాడు శేఖర్.

## 3

శేఖర్‌కు మెలకువ వచ్చేసరికి గదిలో నేలపైన పడివున్నాడు. కిటికీలోనుండి సూర్యకిరణాలు పడి చుర్రుమనిపిస్తున్నాయి.

ఒక్కక్షణం ఏమీ బోధపడలేదు శేఖర్‌కు. 'బెడ్ మీద పడుకున్న వాణ్ణి నేలమీదకి ఎలా వచ్చాను?' అనుకుని ఆశ్చర్యపోయాడు. గది తలుపుకు వేసిన గెడ వేసినట్లే వుంది.

ఆలోచించేసరికి గతరాత్రి జరిగిన ఒక్కొక్క విషయమే గుర్తుకు రాసాగింది....ఆ సంఘటన గుర్తుకు రావడంతో, భయంతో వొళ్ళు జలదరించింది.

అది కలేమోననుకుంటే, తాను స్విచ్ దగ్గర నేలపైన ఎందుకు పడివున్నాడు? పైగా రాత్రి తాను వేసిన లైటు ఇంకా వెలుగుతూనే వుంది!

అది వాస్తవమేనని నిర్ధారణ చేసుకోవడంతో 'మైగాడ్! దయ్యంతోనా మాట్లాడాను?!' అనుకుంటూ గుండెలపైన చేతులు వేసుకున్నాడు.

తాను పెళ్ళిచూపులకు వచ్చాడు. ఆ విషయం ఎరిగినదానిలా ఆ దయ్యం 'పెళ్ళి-కట్నమూ' అంటూ, ఆ ప్రసక్తే ఎందుకు తెచ్చింది?! ఆ సంఘటనకు అర్థమేమిటి? మోహినీ పిశాచాలంటారు-ఇవేనా?.... ఇలా ఆలోచిస్తూనే కాలకృత్యాలు తీర్చుకున్నాడు శేఖర్.

బంగళా వాచ్‌మాన్ చేత కాఫీ, టిఫినూ తెప్పించుకున్నాడు. వాచ్‌మాన్ వయసు మళ్ళిన వాడు.రాత్రి జరిగిన సంఘటనను మదిలో నెమరు వేసుకుంటూ, అతనితో నెమ్మదిగా కదిపాడు శేఖర్.

"ట్రావెలర్స్ బంగళాలో దయ్యాలు వుంటాయని అలకించాను, నిజమేనా తాతా?"

"అవి అన్ని చోట్లా వుండవు బాబూ!" అన్నాడు తాత, నోట్లో చుట్టతీసి కిటికీలోనుండి తుపుక్కున వూసి.

"పోనీ, ఈ బంగళాలో వున్నాయా?"

"నా ఎరికలో అట్లాంటిదేమీ

లేదు బాబూ!"

చెప్పాలా, వద్దా అని కొన్ని సెకనులు తటపటాయించాడు శేఖర్. చివరకు చెప్పడానికే నిశ్చయించుకుని, "తాతా! రాత్రి నా గదిలోకి దయ్యం వచ్చింది...." అన్నాడు.

శేఖర్ వంక తెల్లబోయినట్లుగా వింతగా చూసి, అంతలోనే పెద్దగా నవ్వేసాడు తాత.

"నువ్వు రాత్రి పడుకునేటప్పుడు దయ్యాలగురించే ఆలోచిస్తూ పడుకుని వుంటావు. అందుకే పీడ కలేదో వచ్చింది" అన్నాడు.

"లేదు, తాతా! నిజంగానే జరిగింది....దయ్యంతో నేను మాట్లాడాను కూడాను...."

"పాతికేళ్ళుగా నేనీ బంగ్లాను అంటిపెట్టుకుని వున్నాను బాబూ! ఇంతవరకు ఏ దయ్యం గాని, మోహినీ పిశాచిగాని, ఎవరికీ కనిపించినట్లు ఆలకించలేదు" అన్నాడు తాత ఫైనల్‌గా.

ముసలాడు తన పలుకులు విశ్వసించడం లేదని గ్రహించడంతో, ఆ సంభాషణను అంతటితో ఆపేశాడు శేఖర్.

* * *

అడ్రసు వెతుక్కుంటూ, పెళ్ళిచూపుల ఇంటికి వెళ్ళాడు శేఖర్. ఇల్లు పాతదయినా చూపులకు బాగానేవుంది. గేటు తెరుచుకుని లోపలికి వెళ్ళాడు. వరండాలో ఎవరూ లేరు. ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది.

హాల్లో ఎవరో పెద్ద మనిషి కూర్చుని వున్నాడు. బహుశా ఆయన ఇంటి యజమాని అయి వుండవచ్చుననుకున్న శేఖర్ గుమ్మందగ్గర నిలుచుని "ఏమండీ!" అని పిలిచాడు.

"ఎవరు కావాలి బాబూ?" అంటూ లేచి వచ్చాడాయన.

శేఖర్ చెప్పడంతో, "నేనే మాధవయ్యను మీరెవరు? లోపలికి రండి...." అంటూ ఆహ్వానించాడాయన.

శేఖర్ తనను పరిచయం చేసుకోవడంతో, విచారంగా తల పట్టుకుని కూర్చుండి పోయాడాయన.

"ఇంకెక్కడి అమ్మాయి బాబూ...." అంటూ గొణుక్కున్నాడు. శేఖర్ దిమ్మెరపోయాడు.

"ఏమండీ! ఏం జరిగింది?" అన్నాడు ఆతృతగా.

"అమ్మాయి మమ్మల్ని విడిచిపెట్టి వెళ్ళిపోయి రెండు రోజులయింది బాబూ!"

"వెళ్ళిపోయిందా! ఎక్కడికి?" శేఖర్‌కు బోధపడ లేదు.

"కట్నపు పిశాచికి అందనంత దూరంగా వెళ్ళి పోయింది....నా తల్లి ఆత్మహత్య చేసుకుంది....."

కొయ్యబారి పోయాడు శేఖర్. నోటమ్మట మాట రాలేదు.

"ఉన్న రెండెకరాలూ కట్నంగా ధారబోస్తే మీరేం తింటారంది అమ్మాయి....మిగిలి వున్న ఇల్లు కాస్తా తాకట్టు పెట్టి పెళ్ళి చేస్తే మీ రెక్కడ వుంటారని ఏడ్చింది...." మాధవయ్య దుఃఖంతో చెప్పుకు పోతూంటే, విగ్రహంలా వింటూ వుండిపోయాడు శేఖర్.

"....తనకు ఆ పెళ్ళి వొద్దంది. కట్నం మాట తల పెట్టకుండా, తన వ్యక్తిత్వాన్ని గుర్తించి, తనకు తానుగా గౌరవించి, కోరిచేసుకునే యువకుడు తారసపడేంత వరకు తాను పెళ్ళే చేసుకోనంది సావిత్రి... నా జీవితపు సాయం సంధ్యలో మిగిలి వున్న ఈ ఒక్క బాధ్యతా నెరవేర్చుకో గలిగానన్న సంతృప్తి నాకు దక్కనివ్వమనీ, ఈ పెళ్ళికి అభ్యంతరం చెప్పవద్దనీ మందలించాను. 'భగవాన్! ఈ దేశంలో ఆడదిగా జన్మించడమే అపరాధమా?' అంటూ వెక్కి వెక్కి ఏడ్చింది నాతల్లి...."

పసివాడిలా ఏడ్చాడు మాధవయ్య.

శేఖర్‌కు దుఃఖం ఆగలేదు. అతి కష్టం మీద కన్నీటితో పోరాడాడు.

"బాబూ! తన పెళ్ళయితే నేనూ, వాళ్ళమ్మా దిక్కులేని పక్షులమవుతామన్న బెంగతో, రెండు రోజుల క్రితం ఆత్మహత్య చేసుకుంది. మా సమస్యను పరిష్కారం చేస్తున్నాననుకుంటూ— మా ముసలి గుండెల్లో కార్చిచ్చు రేపి వెళ్ళి పోయిందయ్యా!.... సావిత్రి మమ్మల్ని అన్యాయం చేసి వెళ్ళిపోయింది....!" అంటూ గోడనున్న పెద్ద ఫోటో వంక చూపించాడు మాధవయ్య.

అగరువత్తుల ఘాటయిన సువాసనల మధ్య, పూల దండతో అలంకరింపబడి వుంది సావిత్రి ఫోటో.

"తొందరపడ్డావు సావిత్రీ! రెండు రోజులు ఆగివుంటే...." అంటూ ఫోటోవంక చూసిన శేఖర్ వులిక్కిపడ్డాడు.

ఆమె....!

గత రాత్రి తన గదిలో కనిపించిన యువతి....!!

—కాదు, దయ్యం....!! ●